సాక్షి
శ్రీకాకుళం
బుధవారం ♦ 2 ♦ ఏప్రిల్ ♦ 2025

చర్చి గోడలపై అన్యమత రాతలు

శ్రీకాకుళం: నగరంలోని చిన్నబజారులో ఓ ప్రార్థనా మందిరం గోడలపై అన్యమత రాతలు కలకలం రేపాయి. మంగళవారం రాత్రి వీటిని గమనించిన నిర్వాహకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఈశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గోడలపై ఉన్న రాతలు చెరిపించారు.



మున్సిపల్ కార్మికుల ధర్నా

జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. తమను పర్మినెంట్ చేయాలని కోరారు.

- 8లో

జూనియర్ కాలేజీల్లో తరగతులు ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: 2025-26 విద్యా సంవత్సరానికిగాను జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సెకెండియర్ విద్యార్థులకు తరగతులు మొదలయ్యాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాలలు పనిచేశాయి. అయితే మెజారిటీ కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఇంటర్మీడియెట్ స్పాట్ వాల్యుయేషన్‌లో ఉండటంతో పూర్తిస్థాయిలో తరగతులు ప్రారంభం కాలేదు. తొలిరోజు అంతంత మాత్రంగానే వచ్చారు.

న్యూస్‌రీల్

ఉపాధిలో మూడో స్థానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి జిల్లా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఎన్ఐసీ పోర్టల్ గణాంకాలు ప్రకారం సిమ్మెంట్, మెటల్ రోడ్ల నిర్మాణం, సిమ్మెంట్ కాలువల నిర్మాణం, పాఠశాలల ప్రహరీల నిర్మాణం తదితర పనులు చేపట్టినట్టు తెలిపారు. రానున్న ఆర్థిక సంవత్సరం 2025- 26లలో 'పంచ ప్రాధాన్యాలు' అనే భావనతో పశువులకు నీటి తొట్టెలు, సేద్యపు నీటి కుంటలు, పంట కాలువలను పునరుద్ధరించడం, చెరువులు / కుంటలను సమగ్రంగా అభివృద్ధి చేయడం, దినసరి వేతనం రూ.307కు పెంచడం చేస్తామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రణాళిక ప్రక్రియలో రూ.1499.03 కోట్ల అంచనా విలువతో 41523 పనులను గుర్తించామన్నారు.

జిల్లా ఆస్పత్రి సందర్శన



ఆస్పత్రి పరిసరాలు పరిశీలిస్తున్న కాయకల్ప టీమ్

టెక్కలి రూరల్: స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని మంగళవారం రాష్ట్రస్థాయి కాయకల్ప టీమ్ సందర్శించింది. ఇందులో భాగంగా ఆస్పత్రిలోని పలు వార్డులు, ల్యాబ్‌లు పరిశీలించారు. అలానే ఆస్పత్రి పరిసరాలు, మరుగుదొడ్ల పరిశుభ్రత వంటిని పరిశీలించారు. అనంతరం వార్డుల్లో రోగులకు ఉండే పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి చుట్టుపక్కల వాతవరణం పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాయకల్ప టీమ్ సభ్యులు డాక్టర్ సౌజన్య, పి.కమలాకర్‌లతో పాటు ఆస్పత్రి సూపరిండెంటెంట్ బి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టెలు నిర్మించాలి: కలెక్టర్



నీటి తొట్టి పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నరసన్నపేట: వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో పశువులకు ఇతర జంతువులకు మంచి నీరు అందించాలని, ఈ మేరకు నీటి తొట్టెలు నిర్మించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మండలంలోని తామరాపల్లిలో నీటి తొట్టెల పనులను ఆయన మంగళవారం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. ఒక్కో నీటి తొట్టెకు రూ. 30 వేలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. దీంట్లో భాగంగా నరసన్నపేట మండలంలో 16 నీటి తొట్టెలు మంజూరు చేశారని, ఈ పనులు చురుగ్గా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే తామరాపల్లి గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యానారాయణ, ఎంపీడీఓ బి.మధుసూదనరావు, ఏపీఓ యుగంధర్‌లతో పాటు గ్రామస్తులు ముచ్చ గనేష్, గొద్దు జగన్మోనరావు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ ఈ లైబ్రరీలో అగ్నిప్రమాదం



అగ్ని ప్రమాదం అనంతరం లైబ్రరీ పరిస్థితి

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలోని ఈ లైబ్రరీలో అగ్ని ప్రమాదం జరిగింది. మంగళవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటు చేసుకుంది. గ్రంథాలయంలోని ఏసీలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో పొగలు వచ్చాయి. దీంతో కళాశాల ఆవరణలో ఉన్న అగ్నిమాపక యంత్రంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు సిబ్బంది ప్రయత్నించారు. అప్పటికే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందడంతో వారు వచ్చి, మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కాగా ఈ ప్రమాదంలో గ్రంథాలయంలో ఉన్న పలు కంప్యూటర్లు పనికి రాకుండా పోయినట్లు విద్యార్థులు చెబుతున్నారు. ఆ సమయంలో గ్రంథాలయంలో ఎవరూ లేకపోవడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది.



పరీక్షలు ముగిసిన సంబరంలో విద్యార్థుల కేరింతలు



టీచర్‌కు పరీక్ష రాసిన తీరును వివరిస్తున్న విద్యార్థులు

టెన్‌షన్ తీరింది!

ఎన్నెన్ని రాత్రిళ్లు నిద్ర లేకుండా గడిచాయో.. ఇక ఎంచక్కా ముసుగు తన్నేయవచ్చు. ఎన్నెన్ని వేకువల్లో అలారంలు మోత మోగించాయో. ఇక అలారం గొంతు నొక్కేయవచ్చు. పరీక్షల్లో ఏం వస్తాయో. వచ్చినవి ఎలా రాస్తామో. రాసిన వాటికి ఎంత మార్కులేస్తారో.. అని ఎంత టెన్షన్ పడ్డారో. ఆ 'టెన్'షన్ అంతా ఇక తీరినట్టే. తొలి పబ్లిక్ పరీక్షను టెన్త్ విద్యార్థులు దిగ్విజయంగా ఎదుర్కొన్నారు. ఆఖరి పరీక్ష రాసి వచ్చిన పిల్లల ముఖాలు వెలిగిపోయాయి. హమ్మయ్య.. ఇక సెలవులు వచ్చేశాయన్న ఆనందం అందరి కళ్లలో తాండవించింది.



ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

- జిల్లాలో మొదటిసారి సంచలనాలకు కేంద్రం బిందువుగా టెన్త్ పబ్లిక్ పరీక్షలు
- జిల్లా చరిత్రలో మాయని మచ్చలా కుప్పిలి కాపీయింగ్ ఉదంతం
- పరీక్షలు ముగియడంతో హాస్టళ్ల నుంచి ఇంటి బాట పట్టిన విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నడూ లేని విధంగా జిల్లా ఈ సారి సంచలనాలకు కేంద్ర బిందువుగా మారింది. కుప్పిలి కాపీయింగ్ ఉదంతం మినహా టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో 149 కేంద్రాల్లో మార్చి 17న మొదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. పోలీసుల సహకారంతో 144 సెక్షన్ పక్కాగా అమలు చేశారు. కలెక్టర్, జిల్లా ఎస్పీ సైతం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఆఖరి రోజు సోషల్ స్టడీస్ పేపర్‌కు 28405 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 28254 మంది హాజరయ్యారు. 151 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద ప్రధాన పరీక్షలన్నీ ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. కాగా ఏప్రిల్ మూడో తేదీ నుంచి మూల్యాంకన ప్రక్రియ మొదలుకానుండగా.. అందుకు డీఈఓ తిరుమల చైతన్య, ఏసి లియాకత్ ఆలీఖాన్ నేతృత్వంలో అధికారులు సన్నద్ధం చేస్తున్నారు.

జిల్లా చరిత్రంలో.. మాయని మచ్చగా

జిల్లాలోని ఎచ్చెర్ల మండల పరిధి కుప్పిలి మోడల్ స్కూల్ ఏ, బీ కేంద్రాల్లో మార్చి 21వ తేదీన ఇంగ్లిష్ పేపర్ మాస్ కాపీయింగ్ ఉదంతం మాయని మచ్చలా మిగిలిపోయింది. డీఈఓ తిరుమల చైతన్య నేతృత్వంలో స్క్వాడ్ బృందాలు తనిఖీ చేయడం, ఐదుగురు విద్యార్థులను డీబార్ చేయడం, ఏకంగా 15 మందిని సస్పెండ్ చేయడం, ఆపై టీచర్లు డీఈఓ వైఖరిపై ఆందోళనలు చేయడం వంటివి సంచలనం సృష్టించాయి.

'నాడు-నేడు'తో సకల సౌకర్యాలు..

టెన్త్ పరీక్షలకు కేటాయించిన 149 కేంద్రాల్లో మెజారిటీ కేంద్రాలు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు కావడంతో విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాశారు. బడుల్లో మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమకూర్చిన వసతులు, సౌకర్యాలతో విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాశారు. అత్యాధునిక ఫర్నీచర్, విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు, ఆర్వో ప్లాంట్ల ద్వారా తాగునీరు, మరుగుదొడ్లు ఇలా అన్ని మౌలిక సదుపాయాలు కేంద్రాల్లో అందుబాటులో ఉండటంతో అక్కడి అధికారులు ఎలాంటి ఒత్తిడికి గురికాలేదు. పరీక్ష కేంద్రాల వద్ద పలు ప్రైవేటు జూనియర్ కాలేజీలు, పాలిటెక్నిక్ కాలేజీలు, డిఫెన్స్ అకాడమీల కరపత్రాలను విద్యార్థులకు పంచేందుకు ఆ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది ఎగబడ్డారు. పరీక్షలు ముగియడంతో హాస్టళ్లు, వసతి కేంద్రాల్లో ఉంటున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు.



బతుకుల్లో అలజడి

మంచినీళ్లపేటకు చెందిన ఇద్దరు మత్స్యకారులు గల్లంతు



వంక కృష్ణ (ఫైల్)



ధనరాజు(ఫైల్)

అసలే అమావాస్య రోజులు. సంద్రంలో ఆటుపోట్లు ఎక్కువగా ఉండే వేకువ సమయం. చుట్టూ చీకటి తప్ప ఇంకేమీ లేని వేళలో వారు వేటకు పూనుకున్నారు. కానీ రాకాసి అలలు విరుచుకుపడడంతో తెప్పతో సహా నలుగురు చెల్లాచెదురైపోయారు. ఇద్దరు బతుకుజీవుడా అంటూ తీరానికి చేరుకున్నారు. మరో ఇద్దరు మాత్రం తిరిగి రాలేకపోయారు. మత్స్యకారులు, మెరైన్ పోలీసులు కలిపి వెతికినా ఎక్కడా వారి ఆచూకీ దొరకలేదు.



చాపర్‌తో గాలింపు

- నువ్వలరేవు జెట్టీ వద్ద ఫైబర్ తెప్ప బోల్తా
- క్షేమంగా ఒడ్డుకు చేరిన మరో ఇద్దరు జాలర్లు
- తీరం వెంబడి విస్తృతంగా గాలింపు

వజ్రపుకొత్తూరు:

మండలంలోని నువ్వలరేవు కొత్త జెట్టీ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున సముద్రంలో ఫైబర్ తెప్ప బోల్తా పడిన సంఘటనలో మంచినీళ్లపేట గ్రామానికి చెందిన వంక కృష్ణ(44), బుంగ ధనరాజు(45) గల్లంతయ్యారు. అదే తెప్పలో ఉన్న మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బుంగ కోటేశ్వరరావు, చింతల వెంకటేశ్వరరావు అతి కష్టం మీద ప్రాణాలతో ఒడ్డుకు చేరుకున్నారు. దీంతో మంచినీళ్లపేటలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ సంఘటనలో ఫైబర్ తెప్ప, ఇంజిన్, వలలు పాడై దాదాపు రూ.2.50 లక్షలు మేర నష్టం వాటిల్లింది. స్థానిక మత్స్యకారులు, మెరైన్, స్థానిక పోలీసులు తీరంలో తీవ్రంగా గాలిస్తున్నప్పటికీ గల్లంతైనవారి ఆచూకీ లభ్యం కాలేదు. స్థానిక మత్స్యకారులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

మంచినీళ్లపేటకు చెందిన వంక కృష్ణ, బుంగ ధనరాజు, కోటేశ్వరరావు, చింతల వెంకటేశ్వరరావు కలిసి మంగళవారం తెల్లవారుజామున నువ్వలరేవు జెట్టీ సమీపం నుంచి వేటకు బయల్దేరారు. ఫైబర్ తెప్పను సంద్రంలోకి తీసుకెళ్లే క్రమంలో ఎత్తైన రాకాసి అలలు ఒక్కసారిగా తెప్పపై విరుచుకుపడడంతో నలుగురూ చెల్లాచెదురైపోయారు. ఇందులో కెరటాలకు ఎదురొడ్డి నిలిచిన బుంగ కోటేశ్వరరావు, చింత వెంకటేశ్వరరావు ప్రాణాలతో బయటపడగా గల్లంతైన వంక కృష్ణ, బుంగ ధనరాజుల ఆచూకీ మాత్రం దొరకలేదు.

వంక కృష్ణకు భార్య ఎల్లమ్మతో పాటు ఇద్దరు కుమారులు 13 ఏళ్ల సుమంత్, 8 ఏళ్ల సాయి ఉండగా.. బుంగ ధనరాజుకు భార్య కృష్ణవేణి ఎనిమిదేళ్ల ప్రణీత, నాలుగు నెలల పసికందు సోనియా ఉన్నా రు. వారి రోదనలు స్థానికులకు కంటతడి పెట్టించాయి. వైస్ ఎంపీపీ వంక రాజు, మాజీ సర్పంచ్ గుల్ల చిన్నారావు, జి.శంభూరావు, గ్రామ పెద్దలు ఇచ్చి సమాచారం మేరకు విషయం తెలుసుకున్న మత్స్యశాఖ ఎఫ్‌డీఓ ధర్మరాజు పాత్రో, మెరైన్ సీఐ డి.రాము, స్థానిక సీఐ, ఎస్‌ఐలు తిరుపతి, బి.నిహా ర్ సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి స్థానిక మత్స్యకారులతో కలిసి గల్లంతైన మత్స్యకారుల కోసం అటు గంగవరం నుంచి ఇటు ఒడిశా తీరం గోపాల్‌పూర్ వరకు తీరం వెంబడి విస్తృతంగా గాలించారు. ప్రత్యేక చాపర్ ద్వారా కూడా గాలించారు. బుధవారం నాటికి సమాచారం పూర్తిగా తెలుస్తుందని మత్స్యకారులు చెబుతున్నారు. వంక కృష్ణ భార్య ఎల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.నిహార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోదిస్తున్న ధనరాజు భార్య కృష్ణవేణి, కుటుంబ సభ్యులు

కంచే చేను మేస్తే..

- మద్యం బాటిళ్లతో దొరికిన ఎక్సైజ్ కానిస్టేబుల్

రణస్థలం: మండలంలోని బంటుపల్లి వద్ద ఉన్న యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమలో పని చేస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ బొడ్డేపల్లి జగదీష్ అక్రమంగా మద్యం తరలిస్తూ జేఆర్ పురం పోలీసులకు పట్టుబడ్డాడు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సోమవారం రాత్రి పది గంటల సమయంలో జే.ఆర్ పురం పంచాయతీ పరిధిలో గల జాతీయ రహదారిపై ఒక పెట్రోల్ బంకు సమీపంలో ఎస్ఐ చిరంజీవితో పాటు సిబ్బంది తనిఖీలు చేపట్టగా జగదీష్ రెండు సంచుల్లో 52 కింగ్‌ఫిషర్ బీరు బాటిళ్లతో దొరికాడు. వీటి విలువ మార్కెట్లో రూ. 10,400లు ఉంటుంది. తన స్వగ్రామం పొందూరు మండలంలోని కనిమెట్ట వెళ్తుండగా ఆయన దొరికాడు. ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. యూబీ పరిశ్రమలో లోడింగ్, ఇతర బ్యాచ్ నంబర్లు, బీరు సంబంధిత బ్రాండ్ ఇలా అన్నీ పత్రాలు సరిగా ఉన్నాయో లేవో చూసి ఉన్నతాధికారితో సంతకం పెట్టించి లోడింగ్ వెహికల్ విడిచిపెట్టాలి. ఈ తనిఖీలన్నీ నామమాత్రంగా చేస్తూ తమ జేబులు నింపుకుంటున్నారని పరిశ్రమ కార్మిక వర్గం ఆరోపిస్తోంది.



యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమ

నేటి నుంచి ఉచిత శిక్షణలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పలువురు నిరుద్యోగ యువతకు ఉచిత వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి ఏడో తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నాలుగు శిక్షణ కేంద్రాల్లో ఈ ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



- సీడాప్-డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల టీటీడీసీలో స్వీవింగ్ మిషన్ ఆపరేటర్ పోస్టుకు మూడు నెలల పాటు 60 మందికి శిక్షణ ఇవ్వనున్నారని, కనీస విద్యార్హత పదోతరగతి ఉండాలని తెలిపారు.
- శ్రీసాయివెంకటనారాయణ సొసైటీ వైటీసీ మందస (రెంటికోట) లో సోలార్ ఎల్ఈడీ టెక్నీషియన్, స్మార్ట్‌ఫోన్ టెక్నీషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు 140 మందికి శిక్షణ ఇవ్వనున్నారని, దీనికి ఇంటర్‌లో సైన్సు గ్రూప్ పాస్ అయ్యి ఉండాలని తెలిపారు.
- శ్రీలక్ష్మీదీపా మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ, సింగనవలన సీతంపేట రోడ్‌లో రెస్టారెంట్ కెప్టెన్ కోర్సులకు 3 నెలలు శిక్షణ ఉంటుందని, 140 మందిని తీసుకుంటామన్నారు. ఇందుకు గాను ఇంటర్ లేదా ఐటీఐ చదివి ఉండాలని తెలిపారు.
- శ్రీక్రైట్స్ స్కిల్స్ పీవీటీ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఎచ్చెర్లలోని మహిళా ప్రాంగణం వద్ద గల ఐటీఐ ప్రాంగణం పక్కన ఫుడ్ అండ్ బెవరేజ్, గెస్టు సర్వీసులలో 3 నెలలు శిక్షణ ఉంటుందని, 90 మందిని తీసుకుంటారని, దీనికి పది, ఐటీఐ కోర్సులు చదివి ఉండాలని తెలిపారు.

ఆసక్తి గల వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, జాబ్‌కార్డు రెండు ఫొటోలు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, బయోడేటాతో హాజరుకావాలని తెలిపారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

- 90 శాతం షాపులకు లేనట్టు గుర్తించాం
- 'సాక్షి'తో విజిలెన్స్ ఎస్పీ బి.ప్రసాదరావు

8లో

జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలకు వేళాయె..!

- ఈ నెల 4,5 తేదీల్లో ఎంపికలు

రాతలు రాసిన వారిని పట్టిస్తే రూ.25వేలు

శ్రీకాకుళం క్రైమ్ : జలుమూరు మండలం యలమంచిలి ఎండల కామేశ్వరస్వామి ఆలయ గోడలపై అన్యమత రాతలు రాసిన వ్యక్తుల వివరాలు తెలియపరిస్తే రూ. 25 వేలు నగదు బహుమతి అందజేస్తామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని, ఆ వ్యక్తుల గురించి తెలియజేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు ఎస్పీ 63099 90800, అదనపు ఎస్పీ (క్రైమ్) 63099 90803, శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ 63099 90804, నరసన్నపేట సీఐ 63099 90815, జలుమూరు ఎస్ఐ 63099 90848, ఎస్‌బీ సీఐ 63099 90886 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

కుప్పిలి మోడల్ స్కూల్‌లో విచారణ

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలి మోడల్ స్కూల్‌లో మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో అధికారుల బృందం విచారణ నిర్వహించింది. రాష్ట్ర మానిటరింగ్ అధికారి కె.ధర్మకుమార్ ఆధ్వర్యంలోని బృందం ఈ విచారణ నిర్వహించింది. కుప్పిలి మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 10వ తరగతి ఇంగ్లిష్ పరీక్షలో కాపీయింగ్ ఆరోపణలపై ఐదుగురు విద్యార్థులు డీబార్ అయ్యారు. కుప్పిలి మోడల్ స్కూల్ సెల్ఫ్ సెంటర్ కావటం, చూసిరాతలు ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఎక్కువ కావడం వంటి ఆరోపణల నేపథ్యంలో అధికారులు ఈ విచారణ నిర్వహించారు. గత మూడేళ్లలో స్కూల్ టాపర్లు, ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు అకడమిక్ ప్రగతి నివేదిక వంటివి పరిశీలించారు. అంతర్గత పరీక్షల్లో వారికి వచ్చిన మార్కులు, ఇతర ప్రతిభ వంటివి పరిశీలించారు. చూసి రాత వల్ల ట్రిపుల్ ఐటీకి విద్యార్థులు ఎంపికవుతున్నారా? విద్యార్థులు తమ ప్రతిభ ఆధారంగా ఎంపికవుతున్నారా? అన్న కోణంలో ఈ విచారణ నిర్వహించారు. టాపర్ విద్యార్థుల 8, 9, 10వ తరగతుల్లో వచ్చిన ప్రోగ్రెస్ కార్డులు సైతం పరిశీలించారు. ప్రిన్సిపాల్ కె.అప్పాజీరావు వారికి పాఠశాలలో విద్యా ప్రమాణాలు వివరించారు. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సంపాదించిన విద్యార్థులు మెరిట్ విద్యార్థులని, మాస్ కాపీయింగ్ వల్ల సీట్లు వచ్చాయన్నది అవాస్తవమని చెప్పారు. అన్ని మోడల్ స్కూళ్లలో విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు వస్తున్నాయని తెలిపారు.



కుప్పిలి మోడల్ స్కూల్‌లో అంతర్గత విచారణ నిర్వహిస్తున్న విద్యా శాఖ అధికారులు



క్యూ కట్టాల్సిందే..

సోంపేట:

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలనే పోరు ఓ వైపు.. తల్లికి వందనం రావాలంటే ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలనే వదంతి మరో వైపు.. కలగలిపి సోంపేట తపాలా కార్యాలయం మంగళవారం కిక్కిరిసిపోయింది. అందులోనూ సోంపేట, కంచిలి, కవిటి, మందస మండలాలకు సోంపేట తపాలా కార్యాలయం వద్ద మాత్రమే ఆధార్ అప్‌డేట్‌కు అవకాశం కల్పించడంతో జనమంతా ఒకే రోజు గుమిగూడిపోయారు. బ్యాంకుల వద్ద, మీ సేవ కార్యాలయాల వద్ద ఆధార్ అప్‌డేట్ చేసుకునే సదుపాయం లేకపోవడం, సచివాలయాలను సర్కారే నిర్వీర్యం చేస్తుండడంతో జనాలు క్యూ కట్టక తప్ప లేదు. రేషన్ కార్డులో ఈకేవైసీ చేయించుకోవాలని పంచాయతీ పరిధిలో 500 మందికిపైగా పేర్లు వచ్చాయి. రేషన్ డీలర్ల వద్ద ఆధార్ అప్‌డేట్ కావడం లేదు. దీంతో వారంతా ఆధార్ కేంద్రాలకే పరుగులు తీశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అంతా ఒకేరోజు వచ్చేయడంతో వారికి 15 రోజులకు ఓ సారి స్లిప్పులు అందజేస్తున్నారు. మంగళవారం 450 మందికి స్లిప్పులు అందజేశారు. రోజుకు 30 మందికి అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం ఉంది. అయితే సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్‌కు అవకాశం ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు.





సోంపేట తపాలా శాఖ కార్యాలయం వద్ద క్యూలో ప్రజలు

ఇబ్బందిగా ఉంది..



ఆధార్ అప్‌డేట్ కోసం పోస్టాఫీసు చుట్టూ తిరగడం ఇబ్బందిగా ఉంది. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఇబ్బంది పడుతున్నారు. తల్లికి వందనం పథకంపై ఓ స్పష్టమైన ప్రకటన చేసి అవగాహన కల్పించాలి. - సాహుకారి జాని, జింకిభద్ర

సచివాలయాల వద్ద అవకాశం కల్పించాలి



గత ప్రభుత్వ హయాంలో సచివాలయాల వద్ద సేవలు అందేవి. ఇప్పుడు ఆ అవకాశం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - కొట్నీ శ్రీనివాసరావు, పాలవలస

క్లుప్తంగా

బీసీలంటే చంద్రబాబుకు చులకన


దుంపల లక్ష్మణరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు అని అందరినీ అక్కున చేర్చుకున్నారని.. ప్రస్తుత సీఎం చంద్రబాబుకు మాత్రం ఎప్పుడూ బీసీలను, ఎస్సీలను చులకనగా చూడటం అలవాటైపోయిందని ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ నాయకుడు, వైఎస్సార్ సీపీ కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మనిషిగా పుట్టాలనుకునేవాడెవ్వడైనా ఎస్సీ కులంలో పుడతారా, నాయీబ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానని, బీసీలు ఎంత చెప్పినా వినరు వంటి వ్యాఖ్యలు చేసే చరిత్ర చంద్రబాబుదని మండిపడ్డారు. సూపర్‌సిక్స్ పేరుతో మోసం చేసి తీరా అధికారంలోకి వచ్చాక అప్పులు లెక్కలు చూపించి పథకాలు ఎగ్గొట్టే ప్రభుత్వం కూటమి సర్కారని దుయ్యబట్టారు. విజన్, పీ-4 పేర్లతో అరచేతిలో వైకుంఠం చూపించి కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా బీసీలను చులకనగా చూడకుండా సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించాలని కోరారు.

హెడ్ కానిస్టేబుల్‌కు సత్కారం


కృష్ణమూర్తిని సత్కరిస్తున్న ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.కృష్ణమూర్తి ఉద్యోగ విరమణ పొందడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి దుశ్శాలువ, జ్ఞాపికలతో మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేవీ లెఫ్టినెంట్‌గా గొండ్యాలపుట్టుగ యువకుడు


పదోన్నతి ఉత్తర్వులు అందుకుంటున్న వేణు

కవిటి: కేరళలోని కొచ్చి యూనిట్‌లో సబ్ లెఫ్టినెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కవిటి మండలం గొండ్యాలపుట్టుగకు చెందిన దుద్ది వేణు తాజాగా లెఫ్టినెంట్ హోదాతో పదోన్నతి పొందారు. 2012లో నేవీలో సైలర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన వేణు 2023 ఏప్రిల్ 1న సబ్ లెఫ్టినెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. తాజాగా లెఫ్టినెంట్ హోదాను కల్పిస్తూ నేవీ అధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు. పేదింటి కుర్రోడు ఈస్థాయిలో విజయాన్ని సాధించడం పట్ల గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మరో 25 సంవత్సరాల సర్వీసు మిగిలిన నేపథ్యంలో మరిన్ని పదోన్నతులు పొందే అవకాశం ఉందని రిటైర్డ్ నేవీ ఉద్యోగులు చెబుతున్నారు.

ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలు


జగదీష్‌కుమార్

సారవకోట : మండలంలోని అలుదు గ్రామానికి చెందిన కత్తిరి జగదీష్‌కుమార్ ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. కత్తిరి జనార్దనరావు, వాణిల పెద్ద కుమారుడైన జగదీష్ గత ఏడాది ఐబీపీఎస్ ద్వారా నిర్వహించిన పలు బ్యాంకు ఉద్యోగాల పరీక్షలకు హాజరయ్యాడు. ఈ ఏడాది జనవరిలో వచ్చిన ఫలితాలలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు క్లర్క్‌గా ఎంపిక కాగా మంగళవారం విధుల్లో చేరాడు. తాజాగా మంగళవారం విడుదలైన బ్యాంకు పీఓ, స్పెషల్ ఆఫీసర్ పోస్టు ఫలితాల్లో బ్యాంకు ఆఫ్ బరోడాకు పీఓ, ఐటీ సెక్షన్ స్పెషల్ ఆఫీసర్ పోస్టులకు ఎంపియ్యాడు. ఈ సందర్భంగా జగదీష్‌ను గ్రామస్తులు అభినందించారు.


బుర్రకథ కళాకారుడికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న వెంకటరమణ

జలుమూరు: లింగాలవలస గ్రామానికి చెందిన గంగరాపు వెంకటరమణకు పబ్లిక్ లైబ్రరీ విశాఖపట్నం, దే సిప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ టెక్సాస్(యూఎస్ఏ) ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. 20 ఏళ్లుగా బుర్రకథ రంగంలో విశేష సేవలు, నటుడిగా, పలు సాంఘిక నాటకాల రచయితగా రాష్ట్రం నలుమూలలా వేలాది ప్రదర్శనలు ఇచ్చినందుకు గుర్తింపుగా ఈ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుర్రకథ చరిత్రలో డాక్టరేట్ అందుకున్న మొట్టమొదటి వ్యక్తి తానే కావడం ఆనందంగా ఉందన్నారు.

ట్రేడ్ లైసెన్స్.. తప్పనిసరి

- 90 శాతం షాపులకు లైసెన్సులు లేనట్లు గుర్తించాం
- పీడీఎస్ బియ్యం తరలిస్తే చర్యలు తప్పవు
- మెడికల్ దుకాణాల్లో మరిన్ని తనిఖీలు
- 'సాక్షి'తో విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు



సాక్షి ఇంటర్వ్యూ

శ్రీకాకుళం క్రైమ్ : అక్రమంగా వ్యాపారం సాగించే షాపులపై నిరంతరం నిఘా ఉంటుందని శ్రీకాకుళం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు స్పష్టం చేశారు. ప్రతి షాప్‌కు జీఎస్టీ లైసెన్సుతో పాటు ట్రేడ్ లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని, అనుమతులు లేనివాటిని ఇప్పటికే గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తే కేసులు బుక్ చేస్తామని, ప్రిస్కిప్షన్ లేకుండా మందులు కొనరాదని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రామలక్ష్మణ కూడలి సమీపంలో ఉన్న తన కార్యాలయంలో మంగళవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

ప్రశ్న: జిల్లాలో ట్రేడ్ లైసెన్సు లేకుండా షాపులు ఉన్నాయా..?

జవాబు: జిల్లా కేంద్రంలో 3,109 షాపులు మున్సిపాలిటీ నుంచి ట్రేడ్‌లైసెన్సు పొందినట్లు రిజిస్టర్ అయ్యాయి. ఈ నేపథ్యంలో జీటీరోడ్డు, కళింగ రోడ్డు, పాలకొండ రోడ్డు, పెద్దపాడు రోడ్డులో ఇటీవల సుమారు 1100 షాపులను తనిఖీ చేశాం. వీటిలో 1046 షాపులకు ట్రేడ్ లైసెన్సులు లేవు. అంటే 90 శాతం అనుమతులు లేవు. వీటికి రూ.23,15,570 జరిమానా విధిస్తూ మున్సిపాలిటీ వారికి అంచనా నివేదిక పంపించాం. దీనిని బట్టి జిల్లాలో అనుమతి లేకుండా ఎన్ని ఉంటాయన్నది అంచనా వేసుకోవచ్చు.

ప్రశ్న: అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిపోతుంది. దీనిపై తీసుకుంటున్న చర్యలు?

జవాబు: రెండు లారీలు, ఆటోల్లో అక్రమంగా తరలిస్తున్న 1434.51 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేశాం. గతేడాది చివర్లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో 6ఏ కేసులు 28, క్రిమినల్ కేసులు 21 నమోదు చేశాం.

ప్రశ్న: మెడికల్ షాపులపై ఇటీవల దాడులు చేశారు. నిఘా కొనసాగుతుందా?

జవాబు:ప్రిస్కిప్షన్ లేకుండా, ఎక్స్పైరీ అయిన మందులను కొన్ని షాపుల్లో అమ్ముతున్నారన్న సమాచారం మేరకు దాడులు జరిపాం. ప్రయివేటు ఆసుపత్రుల్లో ఉండే మెడికల్ షాపులపై ఇప్పటికే నిఘా పెట్టాం. మరిన్ని దాడులుంటాయి.

ప్రశ్న: ఐరన్ స్క్రాప్ జిల్లా నుంచి తరలిస్తున్నట్లు వినిపిస్తోంది?

జవాబు:ఇటీవల గుంటూరు కేంద్రంగా చేసుకుని తప్పుడు జీఎస్టీ బిల్లులతో అక్రమంగా విజయనగరం, మన జిల్లాల నుంచి ఎనిమిది లారీల్లో తరలిస్తున్న 14 టన్నుల (12.5 క్యూబిక్ మీటర్లు) ఐరన్ స్క్రాప్‌ను సీజ్ చేశాం. రూ.16 లక్షల వరకు జరిమానా విధించాం. ఒకరిపై ఎఫ్ఐఆర్ వేయించాం.

ప్రశ్న: పర్మిట్లు లేకున్నా క్వారీలు తవ్వడంపై తీసుకుంటున్న చర్యలు?

జవాబు: నందిగాం మండలం లట్టిగాం గ్రానైట్ స్టోన్ క్రషర్‌కు సంబంధించి క్వారీ తవ్వినదానికి, తీసుకున్న పర్మిట్స్‌కు వ్యత్యాసం ఉండటంతో రూ.16 కోట్ల వరకు పెనాల్టీ విధించాం. ఇదే తరహాలో రేగులపాడులో ఇచ్చిన లీజ్ ఏరియా కాకుండా బయట కూడా చేస్తున్నట్లు గుర్తించి రూ.19.65 కోట్లు జరిమానా విధించాం. జగనన్న హౌసింగ్ స్కీమ్‌లో ఇంజినీరింగ్ వెరిఫికేషన్‌లో కన్‌స్ట్రక్షన్ బిల్లు విస్తీర్ణం కంటే స్లాబ్ లెవెల్ పెంచినందుకు గాను రూ. 6.7 కోట్ల జరిమానా వేస్తూ ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ఇంకెక్కడైనా ఇలా జరుగుతున్నట్లు దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మీరు వచ్చాక ఖనిజ సంపద ఎంతమేర పట్టుబడింది?

జవాబు: మన జిల్లాలో కాదు గానీ, విజయనగరం జిల్లా రాజాం మండలం జి.చీపురుపల్లిలో మాంగనీస్ 20 టన్నులు (18 క్యూబిక్ మీటర్లు), ఒక పొక్లెయినర్, లారీ సీజ్ చేసి ఒకరిపై క్రిమినల్ కేసు నమోదు చేశాం. విజయనగరం జిల్లా బట్టిరాజేరు మండలంలో రూ. 9.75 కోట్లు, సారయ్యవలస మండలంలో రూ.12.45 కోట్ల విలువ చేసే క్వార్ట్‌జైట్ మినరల్స్ సీజ్ చేశాం.

ప్రశ్న: ప్రభుత్వ టార్గెట్‌ను చేరుకున్నారా.?

జవాబు: ప్రభుత్వం మాకిచ్చిన యాన్యువల్ టార్గెట్(జరిమానా) రూ.182 కోట్లు. లక్ష్యానికి ఇప్పటివరకు 196.59 కోట్లకు ప్రతిపాదనలు పంపగా సుమారు రూ.120 కోట్లకు ప్రభుత్వం ఆమోదించింది.

మున్సిపల్ కార్మికుల ధర్నా


నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే చర్యలు వెంటనే నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులకు సంబంధించిన ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలు ప్రభుత్వం మానుకోవాలని, తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ మంగళవారం శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి నుంచి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. ఆప్కాస్ రద్దుచేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలనుకోవడం అన్యాయమన్నారు. ఆప్కాస్ వల్ల ఇన్నాళ్లు దళారీల దోపిడీ, వేధింపులు లేవని, జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ వాటా నిధుల్లో కోతలు లేవని చెప్పారు. ప్రైవేటు ఏజెన్సీలైతే సకాలంలో వేతనాలు ఇచ్చే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. విలీన పంచాయతీ కార్మికులకు జీఓ 3 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన నగర విస్తీర్ణానికి అనుగుణంగా మున్సిపల్ సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు. సెలవులు పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. పని ముట్లు, వాహనాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో కె.రాజు, ఎ.రాము, ఎ.గురుస్వామి, ఎ.శేఖర్, జె.మాధవి, డి.యుగంధర్, శంకర్ గణేష్, ఎ.దేవసంతోష్, బాల, ఎ.జనార్దనరావు, డ్రైవర్లు హరి, నాని, ఇంజినీరింగ్ విభాగం నాయకులు పి.మణి, త్రినాథరావు, క్లాప్ డ్రైవర్లు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలనను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: కూటమి ప్రభుత్వం పాలనను గాలికొదిలేసిందని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ధ్వజమెత్తారు. శ్రీకాకుళం ఇందిరా విజ్ఞానభవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు వాటిని అమలు పరచడానికి గత ప్రభుత్వం ఖాళీ ఖజానా ఇచ్చిందని కుంటి సాకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో కరపత్రం విడుదల చేసి ఇప్పుడు రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయకుండా అధ్యయనం పేరుతో కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. రైతులకు గిట్టుబాటు ధర, వలంటీర్లకు గౌరవ వేతనం రూ.10వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని దుయ్యబట్టారు. కాగా, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడిగా అంబటి దాలినాయుడు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా చాన్ బాషాను నియమించామని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి గాదం వెంకట త్రినాథరావు సమక్షంలో నియామకపత్రాలు అందజేశామని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కేవీఎల్ఎస్ ఈశ్వరి, కొత్తపల్లి రాంప్రసాద్, సైదుల్లా ఖాన్, ఎస్.కె.బాషా, బాబు, చోడవరం చంద్రశేఖర్, చోడవరం లీలావతి, సూరియా బేగం పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలకు వేళాయె..


సాధనలో క్రికెటర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: యువ, వర్ధమాన క్రికెటర్లకు జిల్లా క్రికెట్ సంఘం శుభవార్త చెప్పింది. కొత్త సీజన్‌లో ఏసీఏ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్లలో ప్రాతినిధ్యం వహించనున్న పురుషుల వన్డే, టీ-20 జట్ల ఎంపికలకు సన్నద్ధమైంది. ఈ నెల 4న అండర్-23 ఎంపికలు, 5న అండర్-19 ఎంపికలు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారుచేసింది. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాల క్రికెట్ మైదానం వేదికగా ఉదయం 8 గంటల నుంచి ఎంపికలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారుల్లో అండర్-19 విభాగానికి 2006 సెప్టెంబర్ ఒకటి తర్వాత, అండర్-23కి 2002 సెప్టెంబర్ ఒకటి తర్వాత జన్మించి ఉండాలని జిల్లా క్రికెట్ సంఘం పెద్దలు స్పష్టం చేస్తున్నారు. గతంలో వెల్లువెత్తిన ఆరోపణల నేపథ్యంలో సెలక్షన్ కమిటీలను నియమించి అత్యంత పారదర్శకంగా జిల్లా జట్లను ఎంపికచేసేందుకు సన్నద్ధమౌతున్నారు. క్రీడాకారులు విధిగా జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవైఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ తెలిపారు. తెలుపు యూనిఫాంతోపాటు ఎవరి క్రికెట్ కిట్లను వారే తీసుకురావాలని సూచించారు.

గడ్డి కుప్ప దగ్ధం


కాలిపోతున్న గడ్డికుప్ప

టెక్కలి రూరల్: మండలంలోని నంబాలపేట గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో నంబాల ఉదయ్‌బాస్కర్‌కు చెందిన గడ్డి కుప్ప దగ్ధమైంది. పక్కన పొలంలో రైతు చెత్తకు అగ్గిపెట్టడంతో అది కాస్త అంటుకుని సమీపంలో ఉన్న గడ్డి కుప్పకు అంటుకుని దగ్ధమైంది. దానితో పాటు అక్కడే ఉన్న సుమారు 50 సెంట్ల టిట్టంగి పంటకు సైతం మంట అంటుకోవడంతో రైతు అగ్నిమాక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.35వేలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు.

అదిగో పులి!

గార: మండలంలో పులి వదంతులు మరోసారి హల్‌చల్ సృష్టిస్తున్నారు. గార సమీపంలో పులి ఉందంటూ సోమవారం సాయంత్రం నుంచి పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కొర్ని గ్రామానికి వెళ్లే రోడ్డులో పులి చూశానంటూ ఓ వ్యక్తి పోలీసులకు సమాచారమివ్వడం, మంగళవారం ఉదయం కొర్ని సమీపంలో మిరప తోట వద్ద కూలీలు, సాయంత్రం గార సచివాలయం సమీపంలో మరొకరు కూడా పులిని చూశామని చెప్పడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అటవీ శాఖ సిబ్బంది, పోలీసులు పలుచోట్ల పాదముద్రలు పరిశీలన చేసినా ఇంకా నిర్ధారించలేదు. సుమారు పది రోజులుగా పులి సంచారం వార్తలు వినిపిస్తున్నా ఎక్కడా ఎటువంటి నష్టం నమోదు కాలేదు.

కలకలం రేపిన మృతదేహం

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురం పంచాయతీలో రామాంజనేయ థియటర్ సమీపంలో మృతదేహం కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం థియేటర్ సమీపంలో విపరీతమైన దుర్గంధం వెదజల్లడంతో జంతువు చనిపోయి ఉంటుందని భావించి స్థానికులు వెతికారు. ఇంతలో గుడ్ల నారాయణమూర్తి(60) ఇంటి నుంచి దుర్వాసన రావడంతో అక్కడికి వెళ్లారు. తలుపు తీసి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా గుర్తుపట్టలేని స్థితిలో నారాయణమూర్తి చనిపోయి ఉండటం గమనించారు. వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. జె.ఆర్.పురం ఇన్‌చార్జి ఎస్సై జి.లక్ష్మణరావు పరిసరాలను పరిశీలించారు. ఉగాది నాడు ఉదయం చుట్టు పక్కల వారితో మాట్లాడారని, అప్పటి నుండి కనిపించడం లేదని, ఆరోజే చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. భార్య రూప విశాఖపట్నంలోని కుమారుడి వద్ద ఉంటోంది. మృతిపై తమకు ఎటువంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు తెలియజేయడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు.

అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలంటే కష్టం

- జాబ్‌మేళాలో మంత్రి అచ్చెన్నాయుడు


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం కష్టమని.. ప్రైవేట్, స్వయం ఉపాధి రంగాల్లో ఉపాధి కలిగించేలా నైపుణ్యత శిక్షణ అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. మంగళవారం కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమక్షంలో నిర్వహించిన జాబ్‌మేళాను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 32 కంపెనీల ద్వారా 1200 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్ని ఉద్యోగాలు కల్పించామో తెలియడానికి ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. ప్రతీ నియోజకవర్గానికి ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 9 నెలల పాలనలో 7 లక్షల పెట్టుబడులు తీసుకువచ్చామని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ విభాగానికి అధిక శాతం ఉద్యోగాలకు దరఖాస్తులు వస్తున్నాయని మంత్రి వెల్లడించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ వేతనాలు, ప్రదేశాలతో సంబంధం లేకుండా ముందుగా ఉద్యోగాల్లో చేరాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి యు.సాయికుమార్, జిల్లా ఉపాధి అధికారి కె.సుధ, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, నెహ్రూ యువకేంద్రం డీడీ ఉజ్వల, ఉపాధి కల్పన అధికారి వంశీ, నాయకులు కె.హరివరప్రసాద్, బి.రమేష్, బి.రమణమ్మ, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తల్లిపాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న అప్పారావు

శ్రీకాకుళం అర్బన్: బాలల సంక్షేమం, రక్షణ విషయంలో గ్రామ, వార్డు సంక్షేమ, రక్షణ కమిటీలు కీలక పాత్ర పోషించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తల్లిపాలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. అనంతరం బాలల హక్కుల మిషన్ వాత్సల్య సిబ్బంది, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారులతో సమావేశమయ్యారు. బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. తరచూ శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. బాల కార్మికుల భిక్షాటన, బాల్య వివాహాల నిర్మూలన, దివ్యాంగ పిల్లలకు చేయూత, బాలల హక్కుల పరిరక్షణకు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ముఖ్యంగా మహిళా సంరక్షణ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్జేడీతో ఉపాధ్యాయ సంఘాల చర్చలు


ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో కుప్పిలి మోడల్ స్కూల్లో పదో తరగతి పరీక్షల కాపీయింగ్ రగడలో మిగిలిన నలుగురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయడానికి మరో మూడు నాలుగు రోజులు సమయం కావాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి.విజయభాస్కర్ జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులను కోరారు. 3 నుంచి జరగనున్న టెన్త్‌క్లాస్ స్పాట్ వాల్యుయేషన్‌ను బహిష్కరిస్తామని ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం జిల్లాకు వచ్చిన ఆర్జేడీ ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్యను విధుల నుంచి తక్షణమే తప్పించాలని, మిగిలిన ఉపాధ్యాయులపై సస్పెన్షన్లు ఎత్తివేయాలని, ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులను ఉపసంహరించుకోవాలని సంఘాల ప్రతినిధులు కోరారు. వీటిపై మూడు నాలుగు రోజులు గడువు కోరినట్లు ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు చౌదరి రవీంద్ర, తంగి మురళీమోహన్, దుప్పల శివరామ్‌ప్రసాద్, ఎంవీ రమణ, శ్రీరామ్మూర్తి, వెంకటేశ్వరరావు, వసంతరావు, కిషోర్‌కుమార్ తదితరులు పేర్కొన్నారు. అనంతరం డీఈఓ కార్యాలయం ఎదుట అధికారుల వైఖరిని నిరసిస్తూ నిరసన చేపట్టారు. అంతకుముందు అదనపు ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఉపాధ్యాయులపై నమోదైన క్రిమినల్ కేసుల విషయమై తమకు స్పష్టతకావాలని ఉపాధ్యాయులు కోరగా.. ఎస్పైతో నేరుగా అదనపు ఎస్పీ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

వ్యాన్ ఢీకొని బంక్ ఆపరేటర్ మృతి


కాళీ దుర్గాప్రసాద్(ఫైల్)

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర గ్రామంలో వినాయకుడి ఆలయం వద్ద సోమవారం అర్ధరాత్రి దాటాక రోడ్డు దాటుతుండగా రొయ్యల వ్యాన్ ఢీకొట్టడంతో కాపుగోదాయవలసకు చెందిన నందిగాం కాళీ దుర్గాప్రసాద్ (55) మృతి చెందాడు. ఇతను బోరుభద్ర పెట్రోల్ బంక్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంతబొమ్మాళి పోలీసులు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

సోంపేట: మండలంలోని కొర్లాం గ్రామంలో తారకేశ్వర శివాలయం వద్ద చెరువులో పడి వృద్ధుడు మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బారువ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మందస మండలం బాలిగాం గ్రామానికి చెందిన గున్న గున్నయ్య(70) పరిసర ప్రాంతాల్లో యాచకుడిగా జీవనం సాగిస్తున్నాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడిపోవడంతో మృతిచెందాడు. ఎస్ఐ హరిబాబునాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై కొండముచ్చుల దాడి


గాయపడిన సింధు

కంచిలి: మండలంలోని డోలగోవిందపురంలో కొండముచ్చుల దాడిలో అదే గ్రామానికి చెందిన సింధు మూళి అనే బాలిక తీవ్ర గాయాలపాలయ్యింది. మంగళవారం తల్లి ఢిల్లీశ్వరితో కలిసి మెయిన్ రోడ్డు పక్కన ఉన్న అమ్మవారి గుడికి వెళుతుండగా మూడు కొండముచ్చులు ఒక్కసారిగా వచ్చి గాయపరిచాయి. వెంటనే బాలికను మఠం సరియాపల్లి పీహెచ్‌సీలో చేర్పించి చికిత్స చేయించారు. గ్రామంలో చాలా రోజులుగా కోతులు, కొండముచ్చులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రైవింగ్ సెంటర్ల ఏర్పాటుకు మార్గదర్శకాలు విడుదల

శ్రీకాకుళం రూరల్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్లు, రీజనల్ డ్రైవింగ్ సెంటర్లు, డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసుకునేందుకు మార్గదర్శకాలను విడుదలయ్యాయని జిల్లా ఉపరవాణాశాఖాధికారి ఎ.విజయసారధి మంగళవారం తెలిపారు. పూర్తి వివరాలకు www. morth.nic.inవెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

రాష్ట్రంలో సహజ వనరుల దోపిడీ


మాట్లాడుతున్న తిరుపతినాయుడు

శ్రీకాకుళం అర్బన్: కూటమి నాయకులు జిల్లాలో ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌తో సహజ వనరులను దోపిడీ చేస్తున్నారని రాష్ట్ర సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతినాయుడు ధ్వజమెత్తారు. శ్రీకాకుళంలోని రాష్ట్ర సివిల్ రైట్స్ ఫోరం కార్యాలయంలో మంగళవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాపాలన, సంక్షేమంపై దృష్టి సారించాలన్నారు. నదులను యంత్రాలతో తవ్వుకుంటూ పోతే రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడడం ఖాయమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు అక్రమ తవ్వకాలను అరికట్టాలని కోరారు. ఎన్నికల హామీలైన నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు తక్షణమే అమలు చేసి పేదలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిరంకుశ విధానాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, ప్రజా సంఘ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. సమావేశంలో రాష్ట్ర సివిల్ రైట్స్ కార్యదర్శి కె.కోటయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.